# విద్యాభిలాష

జమ్మి శేషగిరిరావుగారు బి.యె;యల్.టి.

౧

పార్వతి పట్టాభిరామారావుగారి కుమార్తె. పెద్దాపురంతాలూకాలోని ఒకచిన్నగ్రామమునకు కరణం ఆమెతండ్రి. లేకలేకగలిగిన కుమార్తెయగుటచేత పార్వతిని అల్లారుముద్దుగా పెంచినారు తల్లిదండ్రులు. పదిపన్నెండేళ్ళు వచ్చేసరికి పార్వతి పల్లెటూరి స్కూళ్ళలోని తరగతులన్నీ చదివేసింది. దగ్గరగా ఒక మైలు దూరంలోవున్న మధ్యమపాఠశాలలలో మూడోఫారం ప్యాసయింది. పెళ్ళిమాట తలపెట్టినప్పుడల్లా యిప్పుడు వద్దంటూవచ్చింది. సిగ్గుచేతనో, చదువుకి స్వస్తిచెప్పాలనోగాని పిల్ల వద్దంటూందని తల్లిదండ్రు లనుకొనే వారు. తల్లిమాటకేమిగాని తండ్రికి పూర్తిగా స్త్రీవిద్యయందే పూర్ణవిశ్వాసముండడంచేత పిల్లను మెట్రిక్యులేషను దాకా చదివించాలనివుంది.

ఇట్లాంటిస్థితిలో జరిగేయి పెళ్ళిమాటలు. పార్వతికి ఒక మేనమామ ఉన్నాడు. ఆయన ఆరోజుల్లోనే కాకినాడ బదిలీఅయి డాక్టరుపని చేస్తున్నాడు. ఆయనద్వారా వెంకట్రావుగారనే ఒక సంపన్నగృహస్థుని జ్యేష్ఠపుత్రుడగు పాపారావునకు వేయినూటపదహార్లు కట్నంతో పెళ్ళిచేయడానికి ఏర్పరిచేరు పార్వతిని. ఆమెతండ్రి తనవుద్దేశ్యమును చెప్పినాడు వియ్యంకునితో. అప్పట్లో సరే అన్నాడు వియ్యంకుడు. అలా అనకపోతే పెళ్ళికాదనే అన్నాడో, నిజంగా తనకోడలు విద్యాధికురాలు కావలెననే అన్నాడో కాని మొత్తంమీద చదువుకి వొప్పుకొనే పెళ్ళిచేసుకున్నారు. కాని వియ్యంకులు మాట్లాడుకున్న యీవిషయము ఎవరు విన్నారు?

పెళ్ళి సలక్షణంగానే జరిగింది. పెళ్ళిఅయింది లగాయితు కొన్నాళ్ళు నోములనీ, వ్రతాలనీ, శ్రావణ పట్టీలనీ, ఆషాఢపట్టీలని ఒకరియింటికి ఒకరు వెళ్ళడంమాత్రం మినహాగా లాంఛనాలు జరిగేయి. పార్వతి మేనమామగారియింట్లో ఎన్నాళ్లో ఉండలేదు. ఆమెమామగారు వెంకట్రావుగారు ఉద్యోగానికి సెలవుపెట్టి కారణాంతరాలచేత చెన్నపట్నంవెళ్ళి కొన్నాళ్ళుఉన్నారు. అందుచేత పార్వతి హాస్టలులోవుండి నాల్గవ ఫారం ప్యాసయింది. అప్పటికి కామెకు యౌవనము అంకురించడం ప్రారంభించినది. కాని చదువుకొంటూన్న హేతువుచేత ఇంటిపట్టున పెద్దవాళ్ళపోషణలేక హాస్టలులోవుండుటచేత బక్కపలుచగానేవుంది. పొడవుకుతగిన శరీరసౌష్ఠవంలేదు.

౨

ఇంతట్లోకే పార్వతి మామగారు తిరిగీ స్వగ్రామంచేరినారు. పార్వతి భర్త అప్పటికే వ్యవసాయ కళాశాలలో చదువు పూర్తిచేసుకొని, వ్యవసాయముచేయుటకు స్వంతభూములు లేక, యితరులవలని భూములను కౌలుకుపొందుటకు తగిన అదనుదొరకక ఆరేటికి యింట్లోనే వున్నాడు. గవర్నమెంటువుద్యోగ మేమీకూడ దొరకలేదు. అందుచేత యింట్లోనేవుండుటవలన పార్వతియొక్క సంగతి అతనిమనస్సుకు స్ఫురించింది.

పార్వతి హాస్టలులోచేరినతర్వాత తిరిగీ సంవత్సరాంతంవరకూ అందులో వుండితీరవలసిందే. అందులోనూ మెట్రిక్యులేషనుక్రిందితరగతిగనుక శ్రద్ధగా చదువుకోవాలి. అత్తవారియింట్లోనే ఉండడంవస్తే చదువుమానడమే మంచిది. అందుచేత పార్వతి అప్పుడప్పుడు రైలుగట్టుదగ్గరకి షికారువచ్చినప్పుడుగాని, స్కూలుకుపోతున్నప్పుడుగాని భర్తకళ్ళపడేది. అతడు మండిపడేవాడు.

ఇదిచూచి స్నేహితురాండ్రతో చనువుగా షికారువెళ్ళడం మానింది పార్వతి. గదిని అంటిపెట్టుకొని కూచునేది. పాపారావు ఒకనాడు తండ్రితో "నాన్నగారూ! మీకోడలుకి చదువు పూర్తిఅయింది. ఇక హాస్టలునుంచి యింటికి రప్పించండి" అన్నాడు. వెంటనే వెంకట్రావుగారు పెద్దాపురం కార్డువ్రాశారు.

ఈలోగాజరిగిన విపరీతం ఎవరికి తెలుస్తుంది? పార్వతి మనోవ్యాధిచేత కృశించి శల్యమైపోయింది. రెండునెలలకు పరీక్షలవుతాయనికూడా ఆలోచించకుండా పెద్దాపురం వెళ్ళిపోయింది. నిజమే ఆస్థితిలో ఆమె అత్తవారియింట్లోకంటె పుట్టింటవుండుటే మంచిది. పిడుగులాగవచ్చింది వెంకట్రావుగారికివార్త. "కోడలిని యిప్పుడు పంపుతారా, లేదా, లేనియడల యిక మీదారిమీది మాదారిమాది" అని వ్రాశారు.

పట్టాభిరామారావుగారు పంపుటకు వీలులేదనీ, శరీరము అస్వస్థతగావుందనీ, కొద్దిరోజులు వోపికపట్టవలసిందనీ జవాబిచ్చేరు. ఆజవాబురుచించలేదు పాపారావుకి. తండ్రిమీద తిరగబడేసరికి వెంకట్రావుగారు వూరుకుంటే నామర్దాగావుంటుందని తక్షణం మోటారులో పెద్దాపురంచేరేరు. పార్వతి వాకిటవున్నది. తండ్రియింటలేడు. తహశ్శీలుదారువారుతనిఖీకి వచ్చినందున పొలముమీదికి వెళ్లినాడు. తల్లి ఎంతో మొరపెట్టుకుంది కాని వినలేదు. కలియుగదుశ్శాసనునివలె పార్వతిని మోటారులోకి నెట్టి కాకినాడ చేర్చేరు.

ఈలోగా రెవిన్యూడిపార్టుమెంటువుద్యోగి గనుక పట్టాభిరామారావుగారు కాకినాడకి తంతి యిచ్చేరు. పోలీసుభటులు మోటారుస్టాండువద్దకివచ్చేరు. వెంకట్రావుగారు బండిమాట్లాడుతో వుండగానే పోలీసువారు కారునుతిన్నగా జడ్జీగారియింటికి నడిపించేరు. అక్కడ జడ్జీగారి సతీమణి పార్వతిని ఆదరించి దయగా మాట్లాడింది. మరునాడు కోర్టులో పిటీషనులుపెట్టి పార్వతిని కాపురమునకు పంపించుటలేదని మామగారున్నూ, మైనరును బలాత్కారంగా తన అధీనంలోంచి తీసుకపొయ్యారని తండ్రిగారున్నూ వాదిస్తూ వుండగా పాపారావు ధుమధుమలాడుతూ అసందర్భప్రలాపాలు ఆడుతూవుంటే కోర్టువారిచే గద్దింపులు తింటూవున్నాడు. ఏమీతోచలేదు పార్వతికి. తన కాపురానికి యింతరవ్వ, రష్టావచ్చిందని విచారించింది. వివాహకాలపు వాగ్దానాలు రుజువుకురాలేదు. అసలుచదివించడమే మాకుయిష్టంలేదన్నారు వెంకట్రావుగారు.

పార్వతిని కోర్టువారు అడిగేరు "నీకు విద్యకావాలా? భర్తకావాలా?" అని. మెల్లగా అందికదా పార్వతి:—"నాకు రెండూకావాలి. హిందూసంఘం యితరవ్యవస్థలలో స్త్రీవ్యక్తిత్వము యింకా పూర్తిగా విజృంభించకపోయినా స్త్రీవిద్యయందు అసూయచూపించేభర్తలుమాత్రం చాలామందివున్నారని నేననుకోను. నాయెదుట నాభర్తనుఅడగండి. నాచదువువలన ఆయనకి గౌరవహానికలిగేటట్టయితే నావిద్యాభిలాషని పూర్తిగా త్రెంపివేస్తా."

ఈమాటలువిన్నాడు పాపారావు. నిజమే! పార్వతిచెప్పినమాటల్లో అబద్ధమేముంది? విద్యరాని స్త్రీకంటె విద్యనభ్యసించినస్త్రీ పురుషునికి అన్నివిధములసహాయపడుటయేగాక, తనగృహకృత్యములను యెక్కువ తెలివితేటలతో నిర్వహించుకొనును. వైద్యవిషయము, పాకశాస్త్రము, గృహమును శుభ్రముగా నుంచుకొనుట, దేహశుభ్రత, వస్త్రములను శుభ్రపరచుకొనుట మొదలగు పనులనన్నింటిని అతిశ్రద్ధతోను, సంతోషముతోను చేసికొనును. శిశుపోషణయందుకూడ మిగుల నేర్పరికాగలరు. విద్య నేత్రమువంటిది. తెలియనివానిని తెలిసికొనుటకు దారి. ఇట్లు వితర్కించి వెంటనే లేచినిలుచున్నాడు. జడ్జీగారు అడగకముందే పాపారావు పార్వతివద్దకువెళ్లి "నాభార్య విద్యాభ్యాసమువలన నాకగౌరవములేదు. ఈమె యిష్టానుసారము విద్యాభ్యాసమొనర్చి విద్యపూర్తియయినదన్నగాని తిరిగి కాకినాడ త్రొక్కదాడ"మని చెప్పుచు పార్వతిని వెంటనిడుకొని చెన్నపట్నముచేరెను. అందరును తెల్లబోయిరి. తరువాత పార్వతి పట్టభద్రురాలై, గృహకృత్యములను నిర్వర్తించుకొనుచు భర్తను సర్వవిధముల దైవముగాతలంచుచుభర్తృసేవాపరాయణయయ్యెను.

1055